ఆలయాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి



మాట్లాడుతున్న సౌత్, ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్

సంతోష్‌నగర్: ఆలయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఆలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సౌత్, ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సూచించారు. ఇటీవల ఆలయాల్లో జరుగుతున్న వరుస ఘటనల నేపథ్యంలో సోమవారం ఐ.ఎస్.స్టేషన్ పరిధిలోని భారత్ గార్డెన్‌లో పీస్ కమిటీ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ పాటిల్ కాంతిలాల్ మాట్లాడుతూ..ఇటీవల ఆలయాల్లో జరుగుతున్న వరుస ఘటనలతో ఆలయాల నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆలయాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే నేరాల నియంత్రణకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సౌత్, ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ స్వామి, చాంద్రాయణగుట్ట డివిజన్ ఏసీపీ కె.మనోజ్ కుమార్, సంతోష్‌నగర్ ఏసీపీ మహ్మద్ గౌస్, ఐ.ఎస్.సదన్ ఇన్‌స్పెక్టర్ జి.నాగరాజు, ఎస్సైలు పాల్గొన్నారు.

విద్యార్థులకు మానవీయ విలువలను బోధించాలి



మాట్లాడుతున్న పెద్దింటి అశోక్ కుమార్

చార్మినార్: విద్యార్థులకు పాఠ్యాంశాల ద్వారా మానవీయ విలువలను, నైతిక జీవనతత్వాన్ని నిరంతరం బోధించాలని సుప్రసిద్ధ రచయిత పెద్దింటి అశోక్ కుమార్ అన్నారు. సిటీ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన పాఠ్యభాగ రచయితతో ముఖాముఖి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మనిషికి, పశువుకు మధ్య ప్రేమ సంబంధాలు శాశ్వతంగా కొనసాగితేనే జీవ వైవిధ్యం నిలుస్తుందని, ఆది నుంచి మానవుడు పర్యావరణంతో, జీవావరణంతో మమేకమై జీవిస్తున్నాడన్నారు. మన చుట్టూ సంచరించే జీవులలో మన నేర్చుకోవాల్సిన ఎన్నో మంచి లక్షణాలున్నాయన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ మాట్లాడుతూ..ప్రాచీన సాహిత్యంలో చిన్నయసూరి లాంటి రచయితలు పశుపక్ష్యాదుల ద్వారా మానవజాతికి నైతిక ప్రమాణాలను బోధించారన్నారు. పెద్దింటి రచనలలో కూడా ఆ వరవడి కనిపిస్తుందన్నారు. నాగార్జున కళాశాల, నల్లగొండ తెలుగు శాఖాధ్యక్షులు డా.వెల్దండి శ్రీధర్ మాట్లాడుతూ.. 'జిగిరి'నవలలోని పాత్రలను రచయిత అద్భుతంగా తీర్చిదిద్దరన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డా.విప్లవ దత్ శుక్లా మాట్లాడుతూ.. పెద్దింటి అశోక్ కుమార్ సభల్లో వినిపించే కోడి కథ తనకి చాలా ఇష్టమని, ఆ కథ నుంచి తానెంతో స్ఫూర్తి పొందానన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యక్షులు డా.కోయి కోటేశ్వర రావు, ఆచార్యులు డా.నీరజ, అవధానం సుజాత, డా.అనంత లక్ష్మి, డా.కాకునూరి సూర్యనారాయణ మూర్తి, డా.కమల సుధారాణి, డా.రాజేంద్ర కుమార్, శ్రీకాంత్ తదితరులు విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



గోల్కొండ: చిన్న పిల్లల్లో క్రికెట్‌పై ఆసక్తి పెరుగుతుందని బీజేపీ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ అన్నారు. బీజేవైఎం ఆధ్వర్యంలో దేవర వంశీ నాయకత్వంలో నిర్వహించిన దేవర కరుణాకర్ మెమోరియల్ క్రికెట్ విజేతలకు సోమవారం ఆయన బహుమతులు అందజేశారు. తాళ్లగడ్డలోని రాజలింగయ్య కబడ్డీ స్టేడియంలో జరిగిన ఈ టోర్నమెంట్‌లో న్యూ హిడన్ మోడల్ హైస్కూల్ విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ.. భారత దేశంలో క్రికెట్‌కు ఉన్న క్రేజ్ మరే దేశంలో లేదన్నారు. గత పదేళ్లలో ప్రధాని మోదీ కేవలం క్రికెట్‌కే కాకుండా అన్ని క్రీడలకు ప్రోత్సాహం ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం గోల్కొండ జిల్లా అధ్యక్షులు నితిన్‌నందేకర్, సెంట్రల్ జిల్లా అధ్యక్షులు సందీప్‌యాదవ్ తదితరులున్నారు.

రహీంపురాలో సమస్యలు పరిష్కరించండి



రహీంపురాలో పర్యటిస్తున్న బీఆర్ఎస్ నాయకులు కుమార్, శ్రీనివాస్ యాదవ్, రవికుమార్

జియాగూడ: రహీంపురా ప్రబోధ్ గర్ల్స్ హైస్కూల్ వద్ద సమస్యలు వెంటనే పరిష్కరించాలని మంగళ్‌హాట్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు హెచ్.కుమార్, రవికుమార్, శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. ప్రబోధ్ గర్ల్స్ హైస్కూల్ ప్రాంతాల్లో చెత్త కుండీలు ఉండడం, రోడ్లు అధ్వానంగా ఉండడం ఎంతో దారుణమన్నారు. రహీంపురా పరిసరాల్లో వారు పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ..జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు అధికారులు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బకేష్ సింగ్, పురుషోత్తమ్ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న గడ్డం జ్ఞానేశ్వర్, కొండూరు గంగాధర్

నాంపల్లి: విధి నిర్వాహణలో ఉన్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్, కొడంగల్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డిపై జరిగిన దాడిని తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సోమవారం నాంపల్లిలో కేంద్ర సంఘం కార్యాలయంలో కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం జ్ఞానేశ్వర్, కొండూరు గంగాధర్ విలేకర్లతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్‌పై దాడికి నిరసనగా వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా మంగళవారం నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. జిల్లాలో విధులు నిర్వహించే నాల్గవ తరగతి ఉద్యోగులందరూ నిరసన కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నిరసనలో భాగంగానే ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలని కోరారు. అధికారులపై దాడులకు పాల్పడిన వారిని చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సహాధ్యక్షులు దాస్య నాయక్, కోశాధికారి ధన్‌రాజ్ పాల్గొన్నారు.

కులగణనతో కురుమలకు ఎంతో మేలు



సమావేశంలో మాట్లాడుతున్న యెగ్గె మల్లేశం

అఫ్జల్‌గంజ్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కులగణనతో కురుమ కులస్తులకు ఎంతో మేలు జరుగుతుందని రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం పేర్కొన్నారు. సోమవారం ముస్లిం జంగ్‌పూల్ వంతెన వద్ద ఉన్న తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం భవనంలో రాష్ట్ర కురుమ సంఘం కార్యవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి యెగ్గె మల్లేశం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. రాష్ట్రంలో అత్యధికంగా జనాభ కురుమ కులస్తులు ఉన్నారని ఈ కులగణన ద్వారా కురుమల సంఖ్య ఎంతో అని తెలుస్తుందన్నారు. ఈ కులగణనలో ప్రతి ఒక్కరూ తమ పేర్లను నమోదు చేసుకోవాలని, నిరుద్యోగ యువతను తమ ప్రాంతాల్ని, ఎంచుకొని కుల బాంధవుల పేర్లను ఈ ప్రక్రియలో నమోదు చేయించాలని ఆయన కోరారు. రాష్ట్ర కురుమ సంఘం ఎన్నికలు త్వరలో నిర్వహిస్తామని ఆ దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. కోకాపేట్‌లో నిర్మించిన కురుమల ఆత్మగౌరవ భవనం, ప్రారంభానికి, త్వరలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ భవనంలో చండీశ్వరి భారతీయ ఎడ్యుకేషన్ సొసైటీని ఏర్పాటు చేసి ఇంజినీరింగ్ కళాశాలను నెలకొల్పేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రస్తుతం సంఘం అన్ని విధాలుగా అభివృద్ధి చెంది ముందుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి బండారు నారాయణ, రాష్ట్ర ట్రస్ట్ బోర్డు సభ్యులు కట్ట మల్లేశం, చీర శ్రీకాంత్, క్యామ మల్లేశం, కొలుపుల నరసింహ, కొండల్‌రాజు, ఎక్కాల కన్నా, చిట్టం శైలేందర్, రాష్ట్ర యూత్ అధ్యక్షులు టి.అరుణ్ కుమార్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు తమ్మగుంట బాలమణి, మిరియాల విజయ, జంట నగరాల కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర కురుమ సంఘం అధికారులు పాల్గొన్నారు.

పార్కింగ్ ఇలా.. పట్టించుకోరా..?



రహదారిపైనే పార్కు చేసిన వాహనాలు

- మద్యం కొనుగోలుకు వచ్చి రోడ్డుపైనే వాహనాల నిలిపివేత
- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని పోలీసులు

జియాగూడ: పురానాపూల్ వంద ఫీట్ల జాతీయ రహదారిలో మద్యం ఏరులై పారుతోంది. పురానాపూల్ నుంచి కేసరి హనుమాన్, 2జీ బస్టాండ్ వరకు మద్యం దుకాణాలు ఉదయం నుంచి రాత్రి వరకు విక్రయాల వల్ల రహదారుల్లో తరచూ ట్రాఫిక్ నిలిచి పోతుంది. రోడ్డు మధ్య వరకు వాహనాలు నిలిపి మద్యం కొనుగోలు, సేవించడానికి గంటల తరబడి వహనాలను రోడ్లపై నిలిపి వేస్తున్నారు. రాత్రి వేళల్లో రోడ్డు మరింతగా వాహనాలతో నిండి పోతున్నాయి. దీంతో తరచూ ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి.

జియాగూడ రోడ్డులో పనులు..

జియాగూడ ప్రధాన రహదారిలో పనులు జరుగుతుండగా ట్రాఫిక్‌ను పురానాపూల్ జాతీయ రహదారి గుండా రాకపోకలు కొనసాగుతున్నాయి. ఆర్టీసీ బస్సులు, జియాగూడ మేకలమండి, సబ్జిమండికి వచ్చే భారీ లారీల కారణంగా నిత్యం జాతీయ రహదారి రద్దీగా ఉంటుంది. ఇదిలా ఉండగా జియాగూడ ప్రాంతాలు హమాలీ, కూలీనాలి చేసుకొని జీవించే వారు అధికం. ఇంటికి వచ్చే రహదారులలో ఉన్న వైన్స్, బార్‌లలో తమ డబ్బులను మద్యానికి ఖర్చు చేస్తున్నారు. అలాగే మండీలకు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వ్యాపారులు, కూలీలు, డ్రైవర్‌ల కారణంగా మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్యతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని బస్తీలవాసులు కోరుతున్నారు.



'నిరాధార ఆరోపణలు మానుకోవాలి'



కురాకుల కృష్ణ

గోల్కొండ: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గం సీనియర్ నాయకుడు కురాకుల కృష్ణ అన్నారు. పనిగట్టుకొని బీజేపీ, బీఆర్ఎస్‌లు ముఖ్యమంత్రిపై లేనిపోని ఆరోపణలు చేస్తూ ఆయన పాలన దక్షతపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయన్నారు. మూసీ ప్రక్షాళనతో హైదరాబాద్ నగర రూపురేఖలు మారుతాయని ఆయన పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళనతో కాంగ్రెస్‌తో పాటు సీఎం రేవంత్‌రెడ్డికి ప్రజాభిమానం మెండుగా లభిస్తుందన్న విషయం ప్రతిపక్షాలకు తెలుసు అని అందువల్లే లేనిపోని ఆరోపణలతో ప్రభుత్వాన్ని బదనామ్ చేయడానికి చూస్తున్నాయన్నారు. ఏదేమైనా ప్రజల కోసం ఏమి చేయాలో సీఎం రేవంత్‌రెడ్డికి బాగా తెలుసు అని ఆయన అన్నారు.

అధికారులపై దాడులు చేయడం దారుణం



డాక్టర్ ఎస్ఎం. ముజీబ్ హుస్సేని

గన్‌ఫౌండ్రీ: విధి నిర్వహణలో ఉన్న వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, కొడంగల్ డెవలప్‌మెంట్ ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డిపై దాడి చేయడాన్ని టీఎన్జీఓ కేంద్ర సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులపై దాడులు చేస్తే ప్రజలకు సేవలు ఎలా అందిస్తారని ప్రశ్నించారు. కలెక్టర్, మరో అధికారిపై జరిగిన దాడికి నిరసనగా వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా ఈ నెల 12న తెలంగాణ ఎన్జీఓల సంఘం ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు దరించి విధులకు హాజరై నిరసన తెలుపుతామన్నారు. దాడి చేసిన వారు ఎంతటి వారినైనా వెంటనే అరెస్టు చేసి చట్టరీత్య చర్యలు తీసుకోవాలని ముజీబ్ హుస్సేని డిమాండ్ చేశారు.

ఇంటి నిర్మాణ పనుల్లో అపశృతి

పునాదుల్లో ఇరుక్కుని గర్భిణికి గాయాలు



కుంగిపోయిన తాహెర్ ఇంటి బెడ్‌రూమ్

నాంపల్లి: ఇంటి నిర్మాణ పనుల్లో అపశృతి చోటుచేసుకుంది. కుంగిపోయిన ఇంటి పునాదుల్లో ఇరుక్కుని గర్భిణికి గాయాలైన సంఘటన హబీబ్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని బజార్‌ఘాట్‌లో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ టంగుటూరి రాంబాబు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బజార్‌ఘాట్ ఖుర్షీద్ జాహీ మసీదు సమీపంలో మునీర్ అనే వ్యక్తి ఇంటి నిర్మాణ చేపట్టాడు. పనుల్లో భాగంగా ఆదివారం రాత్రి జేసీబీ సహాయంతో చదును చేస్తుండగా పక్కనే ఉండే తాహెర్ ఇంటి పునాదులు కదలిపోయాయి. ఆ సమయంలో తాహెర్ ఇంట్లో అద్దెకు ఉంటున్న రుహినా ఫాతిమా(23) అనే గర్భిణి బెడ్‌రూమ్‌లో నిద్రిస్తుండగా ఒక్కసారిగా కుంగిపోయిన పునాదుల్లో ఇరుక్కుంది. ఆమె కేకలు విన్న కుటుంబసభ్యులు ఆమెను పైకి లాగి నాంపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇంటి యజమాని సెట్ బ్యాక్ వదలకుండా పారుగున ఉండే ఇళ్ల పునాదులను జేసీబీ సాయంతో తవ్వడమే ప్రమాదానికి కారణంగా నిర్ధారించారు. బాధితురాలు రుహీనా ఫాతిమా సోదరుడు అజమ్ హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ

సంతోష్‌నగర్: విద్యార్థులు, యువత మాదకద్రవ్యాల బారిన పడి తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ సూచించారు. ఈదిబజార్‌లోని ప్రభుత్వ పాఠశాలలో సోమవారం షీ టీమ్స్, ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆయన డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని..వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. విద్యార్థులు, యువత, ప్రజలు సైబర్ క్రైమ్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం



పద్యాలు చదివి వినిపిస్తున్న విద్యార్థినులు

గోల్కొండ: జాతీయ విద్యా దినోత్సవం అకాడమిక్ కేలెండర్‌లో ప్రధాన దినం అని ది రైజింగ్ స్టార్ నేషనల్ హై స్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ షెహబాజ్ అహ్మద్ అన్నారు. సోమవారం గోల్కొండలోని పాఠశాలలో జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలుగులో పద్యాలు, ఉర్దూలో నాత్, హిందీలో కబీర్‌దాస్‌కే దోహా చక్కగా వినిపించారు. వివిధ అంశాల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆయన బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తమ పాఠశాల విద్యార్థులను తాము ఎన్నడూ పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలకు పరిమితం చేయకుండా వారిని ఇతర అంశాల్లో కూడా శిక్షణ ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవార్డుల ప్రదానం



దీవెనకు అవార్డు అందజేస్తున్న దామోదర్‌గుప్తా తదితరులు

గన్‌ఫౌండ్రీ: రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జై జవాన్ జైకిసాన్ జై కళాకార్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం బాలోత్సవ్ పేరిట పలు సాంస్కృతిక నృత్య ప్రదర్శనలను నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కె.దామోదర్‌గుప్తా మాట్లాడుతూ..చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. అనంతరం బుల్లి తెర నటీమనులు యోగిత, బేబి దీవెన, బేబి శ్రీదేవిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సినీనటి దివ్యవాణి, తెలంగాణ లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వీబీ. రుషి, సంస్థ అధ్యక్షుడు లయన్ కేవీ.రమణా రావు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యశాఖను అగ్రగామిగా తీర్చిదిద్దుతాం



మెట్టు సాయికుమార్‌కు స్వాగతం పలికిన కర్ణాటక మత్స్యశాఖ ఎండీ ఆర్.గణేశా

అబిడ్స్: మత్స్యశాఖను దేశంలోనే నెంబర్:1 స్థాయిలో తీర్చిదిద్దుతామని తెలంగాణ రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర మత్స్యశాఖ అధికారులతో కలిసి కర్ణాటక రాష్ట్రం బెంగళూర్‌లో పర్యటిస్తున్న చైర్మన్ మెట్టు సాయికుమార్‌ను ఆ రాష్ట్ర ఫిషరీష్ ఫెడరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.గణేశా, ఇతరులు ఘనంగా స్వాగతం పలుకుతూ అక్కడి రాష్ట్ర మత్స్యశాఖ అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో తెలంగాణ వ్యాప్తంగా పదేళ్లల్లో ఎన్నడు లేని విధంగా ఉచితంగా అన్ని చెరువులలో చేప పిల్లలను పంపిణీ చేశామన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి, వారి అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తామని ఆయన అన్నారు.

15న మీరాలంమండిలో మహా అన్నకూట్ మహోత్సవం



చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ ప్రాంగణంలో ఈ నెల 15న మహా అన్నకూట్ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. ప్రతి ఏడాది లాగే ఈసారి కూడా మహా అన్నకూట్ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నామన్నారు. ఇందులో భాగంగా నిర్వహించే సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం అనంతరం తులసి పూజ, సహస్ర దీపాలంకరణ, మహా నైవేద్యం, పంచ హారతి తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఇక రాత్రి 7.15 గంటల నుంచి మహా అన్నకూట్, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

అన్నదానం



గోల్కొండ: ఉద్యోగ విరమణ అనంతరం విశ్రాంత జీవనాన్ని ప్రజా సేవకే కేటాయిస్తానని ప్రభుత్వ సెకండ్ లాన్సర్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ప్రభుత్వ సంఘ సేవకుడు మహ్మద్ బషీర్ అన్నారు. సోమవారం ఆయన గోల్కొండ, మెహిదీపట్నం, నాంపల్లి తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద రోగులు, వారి సహాయకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను హైస్కూల్‌లో చదివే రోజుల్లోనే తమ ఉపాధ్యాయుల నుంచి సేవా గుణాన్ని నేర్చుకున్నానన్నారు. తోటి ఉద్యోగులు, శ్రేయోభిలాషులు, పలు ఎన్ఆర్ఐల సహకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానన్నారు.

'కోట'కు పోటెత్తిన పర్యాటకులు



గోల్కొండ: గోల్కొండ కోటకు సోమవారం పర్యాటకులు పోటెత్తారు. కోట టికెట్ కౌంటర్ తెరుచుకోక ముందే పర్యాటకులు టికెట్ల కోసం బారులుతీరారు. సెలవు రోజు కానప్పటికీ పెద్ద ఎత్తున పర్యాటకులు తరలిరావడం కోట అధికారులను సైతం ఆశ్చర్యానికి గురి చేసింది. వచ్చిన పర్యాటకులలో ఇతర రాష్ట్రాలకు చెందిన పర్యాటకులే ఉన్నారని కోట అధికారులు తెలిపారు. కోటలోని ప్రధాన ద్వారం వద్దకు ప్రవేశించగానే పర్యాటకులు ఆశ్చర్యంగా కోటలోని గోడలు, సైనికుల రహస్యపు గదులు, బంకర్‌లాంటి ప్రదేశంలో అక్కన్నమాదన్న కార్యాలయాలను పర్యాటకులు ఎంతో ఆసక్తిగా తిలకించారు. తిరుగు ప్రయాణంలో పర్యాటకులు గోల్కొండ బస్టాప్, చౌరస్తా, బడాబాగ్ తదితర ప్రాంతాల్లోని ఫ్యాన్సీ షాపుల వద్ద కొనుగోలు చేస్తూ సందడి చేశారు.

ఘనంగా మహతి ఆర్ట్స్ అకాడమీ వార్షికోత్సవం



నాంపల్లి: మహతి ఆర్ట్స్ అకాడమీ-విజయనగర్ కాలనీ సంస్థ 21వ వార్షికోత్సవం వేడుకలు సోమవారం రాత్రి నందమూరి తారక రామారావు కళా మందిరంలో వైభవోపేతంగా జరిగాయి. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి అధ్యక్షతన జరిగిన వేడుకలకు ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్, మాజీ ఎంపీ రాజయ్య సిరిసిల్ల హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సినీనటులు డాక్టర్ ఎస్. సుదర్శన్, శాస్త్రీయ కర్ణాటక సంగీతం విద్వాంసులు డాక్టర్ రాఘవాచారి, ఎస్9 టీవీ సీఈఓ ఎం.రవికుమార్, జ్యోతిష్య ప్రపూర్ణ విద్వాంసురాలు డాక్టర్ దాసిక లక్ష్మీ కామేశ్వరి, తెలుగు వర్సిటీ విశ్రాంత ఆచార్యులు డాక్టర్ ఎస్.కె.వెంకటాచార్యులు, సంస్థ కార్యదర్శి వి.కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కచేరి..

ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సంగీత కచేరి అందరిని ఆకట్టుకుంది. గురువు వింజమూరి లక్ష్మీ శిష్యబృందం త్యాగరాజ స్వామి, అన్నమయ్య, ముత్తుస్వామి దీక్షితార్ గీతాలకు కళాకారులు ప్రమోద్, మేఘన, అమూల్య, శ్రీనివాసరావు, దివ్య గీతాలను ఆలపించి అలరింపజేశారు. అనంతరం దివ్యాంగులకు వీల్ చైర్స్‌ను బహూకరించారు.

నాకు ఈ పెళ్లి ఇష్టం లేదు..

పోలీసులను ఆశ్రయించిన యువతి

లంగర్‌హౌస్: రెండ్రోజుల్లో వివాహం.. ఇంతలోనే తనకు ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని ఓ యువతి పోలీసులను ఆశ్రయించిన ఘటన లంగర్‌హౌస్ పోలీస్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. లంగర్‌హౌస్ డిఫెన్స్ కాలనీలోకి చెందిన శ్రావణి (19) తల్లిదండ్రులు కొన్నేళ్ల క్రితం మృతి చెందగా ప్రస్తుతం ఆమె అన్నావదినతో కలిసి ఉంటుంది. గతేడాది శ్రావణికి ఓ యువకుడితో నిశ్చితార్థం జరగగా ఈ నెల 13న వివాహం ఉంది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఆ యువతి నేరుగా లంగర్‌హౌస్ పోలీస్ స్టేషన్ వెళ్లి తనకు ఈ వివాహం ఇష్టం లేదని చెప్పినా.. తన అన్న బలవంతంగా చేస్తున్నాడని పోలీసులకు తెలిపింది. పోలీసులు వెంటనే ఆమె కుటుంబీకులను పిలిచి మాట్లాడగా ఆమె ఒప్పుకున్నాకే నిశ్చితార్థం చేశామని ఇప్పుడు ఎందుకు నిరాకరిస్తుందో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. తాను బ్యూటీషియన్ కోర్సు చేస్తున్నానని ఇంకా చదువుకుంటానని ఆ తర్వాతే పెళ్లి గురించి ఆలోచిస్తానని, ప్రస్తుతం నిశ్చయించిన యువకుడితో మాత్రం తనకు ఇష్టం లేదని శ్రావణి చెప్పడంతో పోలీసులు సఖీ కేంద్రానికి తరలించారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు



గుడిమల్కాపూర్ త్రయంబకేశ్వర ఆలయంలో..



పూజల్లో సాయిబాబాచారి తదితరులు

గోల్కొండ: కార్తీకమాసం పూజలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. కార్వాన్, గుడిమల్కాపూర్, గోల్కొండ, షేక్‌పేట్ తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పూజలు జరిగాయి. గోల్కొండ రిసాలబజార్‌లోని ఆలయంలో బి.సాయిబాబాచారి ఆధ్వర్యంలో కార్తీకమాసం పూజలు నిర్వహించారు.

గుడిమల్కాపూర్‌లో..

అబిడ్స్: కార్తీకమాసం సోమవారం వేడుకలు గుడిమల్కాపూర్ త్రయంబకేశ్వర శివాలయంలో భక్తులు పెద్ద ఎత్తున నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే దీపాలంకరణ చేసి వేడుకలు చేపట్టారు.